COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం :

విజయవాడ,
తేదీ : 3 ఏప్రిల్, 2018.

ఈ రోజు ఎం.ఏ.గఫూర్ అధ్యక్షతన జరిగిన సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ సమావేశం ఈ క్రింది తీర్మానాన్ని ఆమోదించింది. ప్రచురణార్థం మీడియాకు పంపుతున్నాము.

– జె.ప్రభాకర్
ఆఫీసు కార్యదర్శి

## రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం కోసం కృషి చేయాలి.

## సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపు

రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని సిపిఐ(యం), సిపిఐ, జనసేన భావించి ఉమ్మడి ప్రకటన చేశాయి. ఈ ప్రక్రియను కలిసి వచ్చే ఇతర శక్తుల్ని కూడా కలుపుకొని మరింత ముందుకు తీసుకుపోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ పిలుపునిస్తోంది.

రాష్ట్రం విడిపోయాక అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసి రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తారని భావించిన ప్రజలకు తీరని నిరాశే మిగిలింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన బిజేపీ మాట తప్పి తీవ్రమైన ద్రోహం చేసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం 5 కోట్ల ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా హోదా అంశాన్ని పక్కనపెట్టి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తారన్న సాకుతో కేంద్రంతో రాజీపడింది. మరోవైపు ప్రధానప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెసు పాలకపార్టీని ఎదుర్కొని ప్రజల తరపున నిలబడి పోరాడటంలో విఫలమైంది. అంతేకాదు హోదా ఇవ్వకుండా ద్రోహం చేసిన బిజేపీ పట్ల మెతకగా వ్యవహరిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రాన్ని విచ్ఛిన్నంజేయడమేగాక, స్పెషల్ స్టేటస్‌ను చట్టబద్ధంజేయకుండా కాంగ్రెస్ ఆదిలోనే తెలుగు ప్రజలకు తీవ్ర హానిజేసింది.

ఈ విధంగా గత నాలుగేండ్లలో రాష్ట్రంలోని ప్రధాన పాలక పార్టీలు ప్రజాసంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రాభివృద్ధికి తీవ్ర నష్టం కలిగించాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో, ప్రత్యేక హక్కుల్ని సాధించడంలో విఫలమయ్యాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంక్షేమం ప్రాతిపదికగా ప్రత్యేకహోదా, రాష్ట్ర విభజన హామీలు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి, లౌకికవాద ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ఫెడరలిజం, వ్యవసాయ సంక్షోభం వంటి అనేక అంశాల్లో ఉమ్మడి అవగాహనతో ముందుకు పోవడానికి బలమైన ప్రజా ఉద్యమాలు అవసరం. ఇందుకుగాను జనసేన, సిపిఐ, సిపిఐ(యం)లు సహాకరించుకోవడానికి ఒక అవగాహనకు వచ్చాయి. వీటితో పాటు కలిసి వచ్చే ఇతర వామపక్ష, ప్రజాతంత్ర, సామాజిక శక్తులతో కలిసి ప్రత్యామ్నాయ ప్రణాళికతో కృషి చేయాలి. ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న పరిస్థితులలో బిజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికవాదాన్ని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు ఈ విషయంలో రాజీలేని పోరాటం చేయాలి.

మరోవైపు ప్రత్యేక హోదాతో పాటు ప్రజలెదుర్కొంటున్న తక్షణ సమస్యలపై కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని ఉమ్మడి ఉద్యమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఇప్పటికే ప్రత్యేకహోదా సాధన కమిటీ ఆధ్వర్యంలో సాగిస్తున్న కార్యాచరణకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నది. ఇలాంటి విశాల ఉద్యమాలు నిర్మించడానికి వామపక్షాలు చొరవ తీసుకోవాలి. రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలి. ఉమ్మడి ఆందోళనలకు సిద్ధం కావాలని యావత్ ప్రజానీకానికి సిపిఐ(యం) పిలుపునిస్తోంది. ప్రజా సమస్యలపై కృషిని కొనసాగిస్తూనే, ప్రస్తుతం ప్రత్యామ్నాయ దిశగా ఆరంభమైన రాజకీయ ప్రక్రియను మరింత ముందుకు తీసుకుపోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ ప్రాతిపదికపై కలిసి వచ్చే నూతన శక్తుల్ని కూడా గుర్తించి కలుపుకొని పోవాల్సిన అవసరం ఉందని సిపిఐ(యం) భావించింది. అలాంటి శక్తులన్నీ కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నది.

= = = =